సాక్షి విశాఖపట్నం

సోమవారం, 20, అక్టోబర్, 2025



మార్కెట్లకు దివాళీ జోష్

దీపావళి పురస్కరించుకుని నగరం పండగ శోభను సంతరించుకుంది. సోమవారం దీపావళి కావడంతో, ఆదివారం నగరంలోని ప్రధాన మార్కెట్లన్నీ జనసంద్రంగా మారాయి. ముఖ్యంగా పూర్ణా మార్కెట్, జగదాంబ కూడలి, అక్కయ్యపాలెం, కంచరపాలెం, గాజువాక, మధుర వాడ, తదితర ప్రాంతాలు కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. 8లో

• వెలుగుల పండగ..



దీపావళి.. తెలుగు వారి ముంగిట ఎంతో వెలుగులతో జరిగే పండగ. నేడు ప్రతి ఇంటి ముందు కాంతులు వెదజల్లుతూ ఆకాశంలోకి రివ్వున వెళ్లే తారా జువ్వలతో పాటు చిచ్చుబుడ్లు వెలుగుల ముందు అందరూ ఆనందంగా గడుపుతారు. ప్రతి ఇంట్లో సంతోషాల కోలాహలానికి ప్రతీకగా ఇవన్నీ నిలుస్తాయి. పగలు, రాత్రిలానే జీవితంలోనూ కష్టసుఖాలు దోబూచులాడుతుంటాయి. కటిక అమావాస్య నాడు వచ్చే చీకటిని పారద్రోలుతూ ఇళ్ల ముంగిట దీపాలను వెలిగించి కాంతులను విరజిమ్ముతామంటూ వెలుగుల పండగకు విశాఖ సిద్ధమైంది. నగరమంతా దీపావళి సందడి కనిపిస్తోంది.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

• క్రాకర్స్.. స్వీట్స్



శ్రీహరిపురంలోని శ్రీనివాస్ స్వీట్ స్టాల్ వినూత్నంగా ఆలోచించింది. వినియోగదారులను ఆకట్టుకునే విధంగా అచ్చం బాణసంచా ఆకారంలో స్వీట్లను అందుబాటులో ఉంచారు. ఆదివారం ఉదయం నుంచే నార్త్ ఇండియన్స్ మాత్రమే కాక, స్థానిక సౌత్ ఇండియన్ చిన్నారులు, పెద్దలు ఈ విభిన్నమైన స్వీట్లను చూసి ముచ్చట పడి కొనుగోలు చేస్తున్నారు. పాల కోవాతో తయారు చేసిన భూచక్రాలు, చిచ్చు బుడ్లు, విష్ణు చక్రాలు, బాంబులు, కాకర పువ్వొత్తులు వంటి రకరకాల ఆకారాల్లోని స్వీట్లు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ స్వీట్లకు దీపావళి క్రాకర్ రూపాన్ని ఇవ్వడం ద్వారా శ్రీనివాస్ స్వీట్ స్టాల్ యజమాని పండుగ వాతావరణాన్ని మరింత పెంచారు.

– మల్కాపురం

'డ్యూడ్'కి అద్భుత రెస్పాన్స్

డాబాగార్డెన్స్: యూత్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ నటించిన తాజా చిత్రం 'డ్యూడ్'.. దీపావళి కానుకగా విడుదలైంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తి శ్వరణ్ దర్శకుడిగా పరిచయం అయ్యారు. మమితా బైజు కథానాయికగా నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఈ నెల 17న విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన స్పందనతో బ్లాక్‌బస్టర్ సక్సెస్‌ను అందుకుని, హౌస్‌ఫుల్ కలెక్షన్లతో విజయవంతమవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ 'డ్యూడ్' దివాళీ టూర్‌ను చేపట్టారు. తమ సినిమాను అద్భుతంగా ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పేందుకు విశాఖ విచ్చేసిన హీరో ప్రదీప్ రంగనాథన్.. నగరంలోని రామా టాకీస్, సంగం శరత్ థియేటర్లలో ప్రేక్షకులతో 'డ్యూడ్ దివాళీ బ్లాస్ట్' పేరుతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమిళనాడులోనూ గత చిత్రాల కంటే 'డ్యూడ్'కు ఎక్కువ కలెక్షన్లు వస్తున్నాయని తెలిపారు. 'నా గత చిత్రం 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' కంటే తొలి, మలి రోజుల్లోనే నాలుగైదు రెట్లు ఎక్కువ కలెక్షన్లు 'డ్యూడ్' సినిమాకు వచ్చాయని మా నిర్మాతలు చెబుతుంటే చాలా సంతోషంగా ఉంది' అని పేర్కొన్నారు. ఈ ఘన విజయానికి కారణమైన దర్శకుడికి, నిర్మాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న డ్యూడ్ హీరో ప్రదీప్ రంగనాథన్

న్యూస్‌రీల్

నేడు సింహగిరిపై నరకాసురవధ



సింహాచలం : నరకచతుర్దశిని పురస్కరించుకుని సోమవారం రాత్రి సింహగిరిపై జరిగే నరకాసురవధ ఉత్సవానికి దేవస్థానం వైదిక, అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవంలో భాగంగా నరకాసురుడి విగ్రహాన్ని ఒక పల్లకిలోనూ, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులైన గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను మరొక పల్లకిలోనూ వేంజింపజేస్తారు. అనంతరం సింహగిరి మాడవీధిలో ఈ రెండు పల్లకీలను ఎదురెదురుగా ఉంచి, శాస్త్రోక్తంగా నరకాసుర వధ ఘట్టాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా యుద్ధ సన్నివేశాలు, నరకాసుర వధ ఘట్ట విన్నపం పూజలు జరుపుతారు. ఆ తర్వాత పెద్ద ఎత్తున బాణాసంచా కాలుస్తారు. సోమవారం రాత్రి 7 గంటల వరకు మాత్రమే స్వామివారి దర్శనం చేసుకోవడానికి అవకాశం ఉంటుందని దేవస్థానం డిప్యూటీ ఈవో సింగం రాధ తెలిపారు.

22న విశాఖకు రాష్ట్ర గవర్నర్

మహారాణిపేట: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈనెల 22న విశాఖ వస్తున్నారు. బుధవారం రాత్రి 9 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుంచి రొడ్డు మార్గంలో పోతిన మల్లయ్యపాలెంలో వైజాగ్ కన్వెన్షన్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం నొవోటెల్ హోటల్‌కు చేరుకొని అక్కడ బస చేస్తారు. 23వ తేదీ సాయంత్రం 5.35 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి విమానంలో బెంగళూరు వెళతారు.

కలెక్టరేట్లో నేడు పీజీఆర్ఎస్ రద్దు

మహారాణిపేట: దీపావళి ప్రభుత్వ సెలవు దినం కారణంగా సోమవారం కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు ఎవరూ అందుబాటులో ఉండరని, ఫిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు. వచ్చేవారం యథావిధిగా వినతుల స్వీకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు.

స్టీల్ కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు కొనసాగింపు

ఒక్కరోజే 450 మంది అవుట్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుపై ఒకవైపు ఆందోళనలు కొనసాగుతుండగానే.. మరోవైపు యాజమాన్యం తొలగింపు ప్రక్రియను కొనసాగిస్తోంది. తాజాగా శనివారం రాత్రి సుమారు 450 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించింది. స్టీల్‌ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించిన తర్వాత దశలవారీగా ముగిసిన కాంట్రాక్టులను రెన్యూవల్ చేయకపోవడం ద్వారా సుమారు 1,500 మందిని తప్పించింది. అలాగే పనులు చేస్తున్న సుమారు 3,500 మందిని తొలగించింది. దీంతో మొత్తం సుమారు 5,000 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించినట్టు అయింది. వీరిలో సుమారు 270 మంది నిర్వాసితులు కూడా ఉన్నారు. ఈ తొలగింపులపై ఇప్పటికే ఆందోళనలు జరుగుతుండగా.. యాజమాన్యం మరోసారి తొలగింపులు చేపట్టడం గమనార్హం. అయితే శనివారం తొలగించిన 450 మంది జాబితాలో నిర్వాసితులు లేనట్టు సమాచారం.

స్టాళ్ల కేటాయింపులోనూ పచ్చ పాతమే..

- మొదటి వరుస షాపులన్నీ కూటమి కార్యకర్తలకే
- కొనుగోలుదారులకు కనిపించే దుకాణాలు కూటమికి కేటాయింపు
- టీడీపీ, జనసేనకి తలొగ్గిన అధికారులు
- ఎమ్మెల్యేలు చెప్పిన అసోసియేషన్లకే కేటాయింపులు
- బేరాలు రాని దుకాణాలు ఇతర వర్తకులకు

సాక్షి, విశాఖపట్నం:

2, 5, 7, 12, 12ఏ, 13, 14, 15, 16... ఈ నంబర్లు చూసి.. ఐఐటీ, ఎంసెట్, నీట్ ర్యాంకులు అనుకుంటే పొరపాటే.. అధికారాన్ని పక్కన పెట్టేసి.. ప్రభుత్వ పార్టీలకు తలొగ్గి.. 'పచ్చ'పాతంతో కూటమి నేతల అనుచరులకు అధికారులు కేటాయించిన దీపావళి స్టాల్స్ నంబర్లివి. చెప్పుకుంటే.. చాంతాండంత లిస్టు ఉంది. అసలు స్టాల్స్ కేటాయింపుల్లో నంబర్ల గోలేమిటంటే..!

దీపావళి సామాగ్రిని విక్రయించేందుకు ఏటా రిటైల్ స్టాల్స్‌ని నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తారు. ముఖ్యంగా ఏయూ గ్రౌండ్స్, ఏఎస్ రాజా మైదానం, షీలానగర్, గాజువాక మొదలైన ప్రాంతాల్లో స్టాల్స్ ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం అనుమతులు మంజూరు చేస్తుంటుంది. ఈసారి అనుమతుల విషయంలో గందరగోళం నెలకొంది. వందల మంది దరఖాస్తులు చేసుకున్నా.. కూటమినేతలు చెప్పిన వారికే అనుమతులు ముందస్తుగా ఇచ్చేసి.. సాధారణ వ్యాపారులకు ఆదివారం రాత్రి వరకూ పర్మిషన్లు ఇవ్వలేదు. ఎప్పటిలాగానే దరఖాస్తు చేసుకున్న వ్యాపారులు.. లాటరీ పద్ధతిద్వారా తమకు స్టాల్స్ కేటాయించేస్తారనే ఉద్దేశంతో స్టాల్స్ ఏర్పాటు చేసుకున్నారు. వీరిపై అధికారులు జులుం ప్రదర్శించి.. అనుమతులు మంజూరు చెయ్యకుండానే స్టాల్స్ ఏర్పాటు చేశారంటూ ఫైన్లు వేసేశారు. కొందరికి మాత్రమే అనుమతులు వచ్చాయి. కారణం.. వారంతా కూటమి నేతలు సిఫార్సు చేసిన వారు కాబట్టి..

ఎమ్మెల్యేల అసోసియేషన్లకే జై..!

సాధారణంగా.. స్టాల్స్ ఏర్పాటుకు సంబంధించిన అనుమతులే ఓ గాంబ్లింగ్‌గా మారింది. కొందరు వర్తకులు కలిసి ఒక అసోసియేషన్‌గా ఏర్పాటై.. ఇన్ని స్టాల్స్ కావాలంటూ దరఖాస్తు చేసుకుంటారు. అన్ని విభాగాల్ని ప్రసన్నం చేసుకుంటేనే పర్మిషన్లు వెంటనే మంజూరైపోతాయి. కానీ ఈసారి మాత్రం కూటమి ఎమ్మెల్యేలే చక్రం తిప్పేశారు. తమ పార్టీలకు చెందిన అనుచరులు, వ్యాపారులతో అసోసియేషన్లు ఏర్పాటు చేసి.. ఆ జాబితాల్నే అధికారులకు పంపించారు. వాటికే అధికారులు ఓకే చెప్పారు.

సాధారణంగా ఎప్పటిమాదిరిగా ఉన్న అసోసియేషన్ల జాబితాల్ని పక్కనపెట్టేశారు. దీంతో వారంతా అయోమయంలో పడ్డారు. మరోవైపు కూటమి నేతలు ఇచ్చిన అసోసియేషన్లలోనూ పచ్చపాతంతో వ్యవహరించారు. కొందరు వ్యాపారుల్ని వారి జాబితాలో చేర్చారు. కానీ వారికి చివరి స్టాళ్ల కేటాయింపులు చేసి.. ప్రధానమైనవి, ప్రజలు వచ్చిన వెంటనే కనిపించే స్థానాల్లో ఉన్న స్టాల్స్ మొత్తం కూటమి నేతలు తమ అనుచరులకు కేటాయించారు. దీంతో.. పచ్చ లిస్టులోని స్టాల్స్‌కే వ్యాపారాలు సాగుతున్నాయి. మిగిలిన వారు మాత్రం.. తమకు బేరాలు రావట్లేదంటూ లబోదిబోమంటున్నారు. మొత్తంగా.. మతాబుల వెలుగుల్లో జరగాల్సిన దీపావళి పండగ.. కూటమి నేతల మతలబులతో అయోమయంగా మారింది. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు కూడా పచ్చ నేతలకే జై కొట్టి.. మమ అనిపించారంటూ వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కార్తీక శోభకు ముస్తాబవుతున్న శివాలయాలు

- రేపటి నుంచి కార్తీక మాసం ప్రారంభం
- ఏర్పాట్లు చేసిన దేవదాయ శాఖ

మహారాణిపేట: ఆధ్యాత్మికంగా అత్యంత పవిత్రంగా భావించే కార్తీక మాసం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. శివనామ స్మరణలు, దీపాల సందళ్లతో నెల రోజుల పాటు ఆలయాలు కళకళలాడనున్నాయి. కార్తీక మాసం సందర్భంగా మంగళవారం సాయంత్రం నుంచే ఆలయాల్లో ఆకాశ దీపం వెలిగిస్తారు. శివునికి, విష్ణుమూర్తికి అత్యంత ప్రీతిపాత్రమైన ఈ మాసం కోసం జిల్లాలోని శివాలయాలను దేవాదాయ శాఖ ముస్తాబు చేస్తోంది. మంగళవారం నవంబర్ 20 వరకు కార్తీక మాసోత్సవాలు జరుగుతాయి.

ఏర్పాట్లపై దృష్టి

దేవాదాయ శాఖ ఉప కమిషనర్ సుజాత పర్యవేక్షణలో జిల్లా సహాయ కమిషనర్ ఇన్‌చార్జ్ ప్రసాదరావు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు, పందిళ్లు, శానిటేషన్, తాత్కాలిక మరుగుదొడ్లు, మంచి నీటి సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు దీపాలు పెట్టే ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏసీ ప్రసాదరావు సూచించారు. కార్తీక మాసంలో విధులు నిర్వహించడానికి సుమారు 100 మంది ప్రత్యేక సిబ్బందిని వివిధ దేవాలయాల్లో నియమించారు. జిల్లా పరిధిలో భక్తులు అధికంగా వచ్చే 9 ప్రధాన శివాలయాల్లో అదనపు సిబ్బందిని నియమించామని, క్యూలైన్లలో భక్తులు వేచి ఉండకుండా చర్యలు తీసుకుంటామని ఏసీ ప్రసాదరావు తెలిపారు. కార్తీక సోమవారాల ఏర్పాట్లను తాను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని ఆయన పేర్కొన్నారు.



నక్కవానిపాలెం శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయం

కార్తీక సోమవారాలు

- ఈనెల 27 (మొదటి), నవంబర్ 3 (రెండో), నవంబర్ 10 (మూడో), నవంబర్ 17 (నాలుగు).
- కార్తీక పౌర్ణమి/జ్వాలా తోరణం: నవంబర్ 5
- పోలి స్వర్గం: నవంబర్ 21

ఏఎంసీలో మరో 8 పీజీ సీట్ల పెంపునకు గ్రీన్ సిగ్నల్

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లను మరో 8 పెంచేందుకు గ్రీన్ సిగ్నల్ లభించింది. దీంతో ప్రస్తుతం ఉన్న పీజీ సీట్ల సంఖ్య 368 నుంచి 376కు చేరుకుంది. ఈ కొత్తగా పెరిగిన 8 సీట్లలో, పీడియాట్రిక్స్‌లో నాలుగు సీట్లు, ఎమెర్జెన్సీ మెడిసిన్‌లో తొలిసారిగా నాలుగు పీజీ సీట్లు మంజూరయ్యాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్ర వైద్య కళాశాలకు చెందిన 27 వైద్య విభాగాల్లో 131 పీజీ సీట్లు పెరిగాయి. అంతకుముందు 38 వైద్య విభాగాల్లో 237 సీట్లు ఉండగా, ఈ 131 సీట్లు కలపడం ద్వారా మొత్తం సీట్ల సంఖ్య 368కి చేరుకుంది. ఇప్పుడు అదనంగా పెరిగిన ఈ 8 సీట్లతో కలిపి, ఏఎంసీలో మొత్తం పీజీ సీట్ల సంఖ్య 376కు పెరిగింది. పెరిగిన సీట్ల సంఖ్య పట్ల వైద్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవిని కలిసి, డాక్టర్ చక్రవర్తి, రాజేంద్రప్రసాద్, నవీన్ తదితర వైద్యులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

భర్తీకి ఏర్పాట్లు : పెరిగిన ఈ సీట్లను త్వరలో అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. ఈ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ, వైద్య ఆరోగ్య శాఖ కసరత్తు చేస్తున్నాయి. దీనికి అనుగుణంగా ఆంధ్ర వైద్య కళాశాల కూడా ఏర్పాట్లు చేస్తోంది.

సీట్లు పెరగడం చాలా సంతోషంగా ఉందని, అందరి సహకారం వల్లే ఇది సాధ్యమైందని ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి తెలిపారు.



ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవికి అభినందనలు తెలియజేస్తున్న వైద్యులు

ట్రంప్ వాణిజ్య యుద్ధంతో దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి లోకనాథం

డాబాగార్డెన్స్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం భారతదేశంతో సహా ప్రపంచ దేశాలన్నిటిపైనా తీవ్ర ప్రభావం చూపుతోందని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి లోకనాథం ఆందోళన వ్యక్తం చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం జగదాంబ జంక్షన్ సమీపాన కార్మిక భవనంలో ఎండీ ఆనంద్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ట్రంప్ విధించిన టారీఫ్ సుంకాల వల్ల మన దేశంలోని వ్యవసాయ రంగం ధ్వంసమై, పారిశ్రామికోత్పత్తి దెబ్బతింటోందన్నారు. సేవా రంగం గందరగోళంలో పడి మొత్తం ఆర్థిక సంక్షోభాన్ని తీవ్రం చేస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఆక్వా, టెక్స్‌టైల్, గార్మెంట్, పట్టు వంటి రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయన్నారు. దీని ఫలితంగా ఉద్యోగులు, కార్మికులు, రైతాంగం రోడ్డున పడి ఇంటా బయటా ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని, విద్యార్థులు, యువత భవిష్యత్తు అగమ్యగోచరమవుతుందని ఆయన పేర్కొన్నారు. మన దేశ ప్రయోజనాలు కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అందిపుచ్చుకోవాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ట్రంప్ అడుగులకు మడుగులొత్తే లొంగుబాటు వైఖరిని ప్రదర్శిస్తోందని లోకనాథం విమర్శించారు. భారత్ నుంచి దిగుమతయ్యే టెక్స్‌టైల్, దుస్తులు, రొయ్యలు, చేపలు, ఇతర సముద్ర ఉత్పత్తులు, లెదర్, వజ్రాభరణాలు వంటి అన్నింటిపైనా ట్రంప్ ప్రభుత్వం సుంకాలు పెంచిందన్నారు. గతంలో 2.5 శాతం ఉన్న సుంకాలను 50 శాతానికి పెంచడం వల్ల దాదాపు 7 లక్షల కోట్లకు పైగా భారత ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతుందని అంచనా వేశారు. మన ఉత్పత్తులకు మార్కెట్ తగ్గడంతో పరిశ్రమలు, సేవారంగం దెబ్బతిని, ఉద్యోగులు, కార్మికులు వీధిన పడతారని ఆయన వివరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, ఉపాధ్యక్షులు తిరుకోటి చిరంజీవి, బొమ్మల రఘురామ్, కె. రంగమ్మ, కె. క్రాంతిబాబు, ఎ. తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారకుడిపై దాడి

తగరపువలస: త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రచారం చేస్తున్న ప్రబోధానందుని శిష్యులపై ఆదివారం భీమిలి, తగరపువలస ప్రాంతాల్లో దాడి జరిగింది. ఫిజియోథెరపిస్ట్ అయిన ముమ్మిడిశెట్టి ఆదిత్య అనే వ్యక్తి మరికొందరితో కలిసి తమపై దాడి చేశారని, త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథాలను విసిరి, ప్రచార స్టాళ్లను విరగ్గొట్టారని భీమిలి మండలం తాటితూరుకు చెందిన బోని శ్రీనివాసరావు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'స్టాళ్లు ఏర్పాటు చేయడానికి మీకు ఎవరు అనుమతి ఇచ్చారు?' అంటూ ఆదిత్య దూషణలకు దిగి, కొడతానని బెదిరించినట్టు బాధితుడు తెలిపారు. ముఖ్యంగా, ఆదిత్య అయ్యప్పస్వామి మాల ధరించి ఈ దాడికి పాల్పడటం గమనార్హం. ఈ ఘటనపై భీమిలి పోలీసులు ఇరువర్గాలను పిలిచి విచారణ చేస్తున్నారు.

సొంత గనులతోనే విశాఖ ఉక్కు మనుగడ సాధ్యం



మహాసభలో మాట్లాడుతున్న స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధానకార్యదర్శి లలిత్ మిశ్రా

ఉక్కునగరం: విశాఖ ఉక్కు కర్మాగారం మనుగడ సాగించాలంటే సొంత గనులు తప్పనిసరి అని స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా స్పష్టం చేశారు. ఆదివారం ఉక్కునగరంలోని గురజాడ కళాక్షేత్రంలో జరిగిన స్టీల్ ప్లాంట్ సీఐటీయూ 12వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ పరిశ్రమలు, కార్మికుల పట్ల అవలంబిస్తున్న నిరంకుశ విధానాలను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే ప్రయత్నంలో భాగంగానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'నేషనల్ పైప్‌లైన్' పేరుతో 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి, 12–13 గంటల పని విధానాన్ని బలవంతంగా అమలు చేస్తోందని విమర్శించారు.

కర్మాగార పరిరక్షణ, కార్మిక హక్కుల కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఈ సందర్భంగా లలిత్ మిశ్రా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నర్సింగరావు, ఎన్. రామారావు, సీపీఎం నాయకులు ఎం. జగ్గునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నత్త నడకన ఈ-క్రాప్

- ఆందోళనలో రైతులు
- ఈ క్రాప్ నమోదులో నెట్‌వర్క్ సమస్యలు

మహారాణిపేట: పంట నష్టపరిహారం, పంటల బీమా, రుణాలు, సున్నా వడ్డీ, కనీస మద్దతు ధర వంటి ప్రభుత్వ రాయితీలు పొందాలంటే తప్పనిసరి అయిన ఇ-క్రాప్ నమోదు ప్రక్రియ జిల్లాలో నత్తనడకన సాగుతోంది. ఎంతో కీలకమైన ఈ ప్రక్రియ ఆలస్యం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తొలుత సెప్టెంబర్ 30వ తేదీని చివరి గడువుగా నిర్ణయించినప్పటికీ, లక్ష్యాన్ని చేరుకోకపోవడంతో దీన్ని అక్టోబర్ నెలాఖరు వరకు పొడిగించారు. ఈ-క్రాప్ బుకింగ్‌లో రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానశాఖ సిబ్బందికి పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా నెట్‌వర్క్ సమస్యలు, పలు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లోపం, సాంకేతిక సమస్యలు, సిబ్బంది కొరత ఆలస్యానికి కారణాలని తెలుస్తోంది. ముఖ్యంగా భూమి రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో సిబ్బందికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన వంటి పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇ-క్రాప్ బుకింగ్‌లో జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 80 శాతం పూర్తయింది. జిల్లాలో 11,599 ఎకరాల్లో వరి సాగు చేయగా, అందులో 75 శాతం అంటే 8,247 ఎకరాల్లో ఇ-క్రాప్ నమోదు పూర్తయ్యింది.

నెలాఖరునాటికి పూర్తి : జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి మాట్లాడుతూ... ఈ-క్రాప్ ద్వారా ఏ రైతు ఏ సర్వే నంబర్‌లో ఏ రకం పంట, ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే పూర్తి సమాచారం అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ నెలాఖరు నాటికి నూరు శాతం ఇ-క్రాప్ నమోదు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ప్రభుత్వ ఫలాలు సులభంగా అందేందుకు రైతులు అధికారులకు సహకారం అందించాలని ఆయన కోరారు.



నగర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు



దాబాగార్డెన్స్: నగర ప్రజలకు మాజీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు హరిత దీపావళి, స్వచ్ఛ దీపావళి, శుభ దీపావళిని రంగు రంగుల దీపాలతో ఆనందంగా జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. మతాబులు, మందుగుండు సామగ్రిని కాల్చడం వల్ల వాయు, శబ్ద కాలుష్యం పెరుగుతుందన్నారు. శబ్ద కాలుష్యం చిన్న పిల్లలు, వృద్ధులు, పశువులు, మూగజీవులకు ఆందోళన కలిగించి ప్రమాదాలకు గురి చేస్తుందని, వాయు కాలుష్యం అనారోగ్యానికి దారితీస్తుందని ఆమె హెచ్చరించారు. ప్రజలందరూ బాణసంచాకు బదులుగా అందమైన దీపాలు వెలిగించి కాలుష్యం లేని పండగను జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దివాళీ ధోకా

- ఏయూ మైదానంలో బాణసంచా స్టాళ్ల అనుమతుల్లో గందరగోళం
- ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ జోక్యం
- 14 నుంచి పనులు చేపట్టినా, 16న అనుమతులు మంజూరు
- పోలీస్ అనుమతులు లేకుండానే స్టాళ్ల ఏర్పాటు





ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో బాణసంచా విక్రయాలు

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలో బాణసంచా స్టాళ్ల అనుమతుల వ్యవహారం రచ్చకు దారితీసింది. ఎప్పుడూ లేని విధంగా దుకాణాల లీజు అంశం దుమారం రేపింది. ఈ విషయంలో ఏకంగా రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ జోక్యం చేసుకోవడం వర్సిటీ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. అనుమతులు లేకుండానే పనులు ప్రారంభించడం, ఆ తర్వాత అనుమతుల కోసం కలెక్టర్ ఉన్నత విద్యా శాఖకు లేఖ రాయడం, అనంతరం అనుమతులు ఇవ్వాలని అక్కడి నుంచి వీసీకి లేఖ రావడం, చివరకు 14వ తేదీ నుంచి పనులకు అనుమతులు ఇచ్చినట్లు 16న ఉత్తర్వులు ఇవ్వడం గమనార్హం. అది కూడా ఏయూ వీసీ కాకుండా.. రిజిస్ట్రార్ పేరుతో అసిస్టెంట్ రిజిస్ట్రార్(అకౌంట్స్) సంతకంతో అనుమతులు ఇవ్వడం మరింత చర్చనీయాంశమైంది. కాగా.. ఏయూలోని స్టాళ్లలో సగానికి పైగా ఎటువంటి లైసెన్సులు లేకుండానే ఏర్పాటైనట్లు తెలుస్తోంది. ఈ విషయంలో పోలీసులు ఆదివారం మధ్యాహ్నం కొంత సేపు హడావుడి చేసి వెళ్లిపోయారు.

ఉన్నత విద్యా శాఖ జోక్యం

ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలో బాణసంచా స్టాళ్లను ప్రతి ఏటా ఏర్పాటు చేయడం సాధారణం. దీనికి ఏయూ వీసీ అనుమతులు ఇవ్వడం సర్వసాధారణ విషయం. కానీ ఈ సారి మాత్రం స్టాళ్ల అనుమతుల అంశం గందరగోళంగా, వివాదాస్పదంగా మారింది. ఏయూ మైదానాలను, ప్రాంగణాలను ప్రైవేట్ కార్యక్రమాల కోసం అనుమతులు ఇవ్వకూడదని ప్రభుత్వం గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. కొద్ది నెలల కిందట బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సినిమా ఈవెంట్‌కు అనుమతులు ఇవ్వడం తీవ్ర దుమారం రేగింది. దీంతో అప్పటి నుంచి ప్రైవేట్ కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వడం లేదు. ఇటీవలే క్రెడాయ్ ఒక కార్యక్రమ నిర్వహణకు ఈ మైదానాన్ని లీజుకు కోరగా.. ఇదే కారణంతో తిరస్కరించారు.

అయితే.. దీపావళి సందర్భంగా ఏటా మాదిరిగానే ఈసారి కూడా ఇంజినీరింగ్ గ్రౌండ్‌లో స్టాళ్ల ఏర్పాటుకు వ్యాపారులు సిద్ధమయ్యారు. దుకాణాల కోసం మైదానాన్ని లీజుకు ఇవ్వాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఏయూ వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్‌కు లేఖ రాశారు. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు దుకాణాల పనులకు, 18 నుంచి 20వ తేదీ వరకు అమ్మకాలకు, 21న స్టాళ్ల తొలగింపునకు అనుమతులు ఇవ్వాలని కోరారు. దీనిపై వీసీ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ 13వ తేదీ నుంచే గ్రౌండ్‌లో పనులు చేపట్టేశారు. దీనిపై 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో కలెక్టర్ హరేందిర ప్రసాద్ సీరియస్ అయ్యారు. అనుమతులు లేకుండా ఎలా స్టాళ్లు ఏర్పాటు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం ఆయన అనుమతుల కోసం రాష్ట్ర ఉన్నత విద్యా శాఖకు లేఖ రాశారు. దీంతో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కార్యాలయం నుంచి ఏయూ వీసీకి లేఖ వచ్చింది. కలెక్టర్ లేఖపై సమస్యను పరిష్కరించి, 14 నుంచి అనుమతులు ఇవ్వాలని 15న లేఖ పంపించడం ఇక్కడ విశేషం.

పనులు ప్రారంభించాక అనుమతులు

కలెక్టర్ ఆదేశాలతో ఇంజినీరింగ్ కాలేజ్ హెలిప్యాడ్ మైదానంలో ఉన్న స్టాళ్ల పనులను తొలగించారు. రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ జోక్యంతో కొత్తగా దుకాణాలను పార్కింగ్ మైదానానికి మార్చారు. ఇదిలా ఉండగా.. 15న ఉన్నత విద్యా శాఖ నుంచి లేఖ వస్తే, 16న ఏయూ అధికారులు అనుమతులు ఇచ్చారు. అది కూడా 14న పనులకు అనుమతులు ఇస్తున్నట్లు 16న ఉత్తర్వులు ఇవ్వడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రధానంగా ఈ అనుమతుల పత్రంపై ఏయూ వీసీ సంతకంతో కాకుండా, రిజిస్ట్రార్ పేరుతో అసిస్టెంట్ రిజిస్ట్రార్ (అకౌంట్స్) సంతకం ఉండడం గమనార్హం. తమ చేతికి మట్టి అంటకుండా, ఏదైనా సమస్య వస్తే దాన్ని కింది వారిపైకి నెట్టేసే ఉద్దేశంతోనే ఈ విధంగా చేశారన్న చర్చ జరుగుతోంది.

అనుమతులు లేకుండా స్టాళ్లు

నగరంలో అనుమతులు లేకుండా బాణసంచా నిల్వలు, వ్యాపారాలపై పోలీసులు వారం రోజులుగా వరుస దాడులతో హడావుడి చేశారు. కానీ ఏయూలో అనేక దుకాణాలు అనుమతులు లేకుండా ఏర్పాటు చేసినా పట్టించుకోలేదు. బాణసంచా విక్రయాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు. కానీ ఏయూలో ఇష్టానుసారంగా వ్యాపారాలు చేస్తున్నా పోలీసులు చూసీచూడనట్లు వదిలేశారు. ఆదివారం మధ్యాహ్నం డీసీపీ, ఏసీపీలు వెళ్లి అనుమతులు లేని స్టాళ్లను వెంటనే మూసేయాలని స్పష్టం చేశారు. లేని పక్షంలో అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసి వెళ్లిపోయారు. కానీ ఏ ఒక్కరూ పోలీసుల హెచ్చరికలు పట్టించుకోకుండా అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు చేపట్టడం గమనార్హం.

తిరుమలనగర్‌లో చోరీ

ఆరున్నర తులాల బంగారం అపహరణ

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్‌లోని ఓ ఇంట్లో శనివారం రాత్రి దొంగతనం జరిగింది. నిద్రిస్తున్న కుటుంబ సభ్యులకు తెలియకుండా ఆరున్నర తులాల బంగారు నగలను దొంగ అపహరించాడు. ఈ ఘటనకు సంబంధించి దువ్వాడ క్రైం పోలీసులు తెలిపిన వివరాలివి. హిందూస్థాన్ షిప్‌యార్డులో మేనేజర్‌గా పనిచేస్తున్న ఎం.నాగేశ్వరరావు తిరుమలనగర్‌లో తన కుటుంబంతో నివసిస్తున్నారు. శనివారం రాత్రి భోజనాలు ముగించిన తర్వాత వారంతా నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి వేళ ఓ దొంగ తాను తెచ్చుకున్న పరికరంతో ఇంటి లోపలి గడియను చాకచక్యంగా తీసి ఇంట్లోకి ప్రవేశించాడు. ఇంట్లో వారంతా నిద్రిస్తున్నట్లు గమనించి బీరువా తాళం తీసి, అందులో ఉన్న నాలుగు తులాల పుస్తెల తాడు, రెండు తులాల చైను, అర తులం ఉంగరం, రూ.5వేల నగదును దొంగిలించాడు. నగలు అపహరించిన అనంతరం, దొంగ గడియను యథావిధిగా వేసి వెళ్లిపోయాడు. తెల్లవారిన తరువాత ఈ విషయాన్ని గుర్తించిన నాగేశ్వరరావు వెంటనే దువ్వాడ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు బెంగళూరుకు ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం: విశాఖ–ఎస్ఎంవీ బెంగళూరు(08545) వన్‌వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖ–ఎస్ఎంవీటి బెంగళూరు(08545) వన్ వే స్పెషల్ రైలు ఈ నెల 21న విశాఖపట్నంలో ఉదయం 8.20 గంటలకు బయలుదేరుతుంది. మరుసటిరోజు ఉదయం 6.45 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది.

యారాడ బీచ్‌లో ఇద్దరు యువకుల గల్లంతు



బొత్స పవన్‌కుమార్ (ఫైల్)



పగడాల గణేష్ (ఫైల్)

పెదగంట్యాడ: యారాడ తీరంలో సరదాగా గడుపుతున్న ఇద్దరు యువకులు సముద్రపు అలల ఉధృతికి గల్లంతయ్యారు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. న్యూపోర్ట్ పోలీస్ స్టేషన్ సీఐ కామేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. గాజువాక, పెదగంట్యాడ ప్రాంతాలకు చెందిన తొమ్మిది మంది స్నేహితులు మూడు ద్విచక్ర వాహనాలపై ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో యారాడ తీరానికి చేరుకున్నారు. వీరంతా సముద్రం వద్ద ఇసుకలో ఆటలాడుతుండగా, వారిలో ఇద్దరు.. ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న జీవీఎంసీ 76వ వార్డుకు చెందిన బొత్స పవన్‌కుమార్ (26), డిగ్రీ చదువుతున్న గాజువాక కైలాస్‌నగర్‌కు చెందిన పగడాల గణేష్ (17) సముద్ర స్నానానికి దిగారు. ఈ సమయంలో సముద్రపు కెరటాల ఉధృతి పెరగడంతో వారు లోపలికి కొట్టుకుపోయారు. వారిని రక్షించడానికి తోటి స్నేహితులు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. సమాచారం అందుకున్న వెంటనే న్యూపోర్ట్ పోలీస్ స్టేషన్ సీఐ కామేశ్వరరావు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రెస్క్యూ సిబ్బందితో కలిసి గాలించినప్పటికీ యువకుల ఆచూకీ లభించలేదు. గల్లంతైన యువకుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు న్యూపోర్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్లకు వెలుగుల సందడి

- కొనుగోళ్లతో కళకళ
- జోరుగా బాణసంచా విక్రయాలు



పువ్వులు కొనుగోలు చేస్తున్న మహిళలు



కుమ్మరి వీధిలో ప్రమిదల దుకాణం వద్ద కొనుగోళ్లు

జగదాంబ: దీపావళి పురస్కరించుకుని విశాఖ మహా నగరం పండగ శోభను సంతరించుకుంది. సోమవారం దీపావళి కావడంతో.. ఆదివారం నగరంలోని ప్రధాన మార్కెట్లన్నీ జనసంద్రంగా మారాయి. ముఖ్యంగా పూర్ణా మార్కెట్, జగదాంబ కూడలి, అక్కయ్యపాలెం, కంచరపాలెం, గాజువాక, మధురవాడ, తదితర ప్రాంతాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పండగకు అత్యంత ముఖ్యమైన లక్ష్మీ పూజ కోసం అవసరమైన పూజా సామగ్రి, పూల దండలు, పండ్లు, మట్టి ప్రమిదలు, చెరుకు గడలు, దివ్వెలు వెలిగించేందుకు ఆముదం కర్రలు కొనుగోలు చేసేందుకు ప్రజలు, ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మార్కెట్లలో ఎక్కడ చూసినా పండగకు అవసరమైన వస్తువులతో దుకాణాలు వెలిశాయి. ఈ సందడి దీపావళి వెలుగులతో పాటు కార్తీక మాసం ఆగమనానికి దర్పణం పట్టింది.

అంబరాన్నంటిన ధరలు

పండగను ఆసరాగా చేసుకుని వ్యాపారులు ధరలను అమాంతం పెంచేశారు. ముఖ్యంగా పూల ధరలు ఆకాశాన్నంటాయి. కేవలం 50 గ్రాముల పూలు రూ.150కి పైగా పలకడం గమనార్హం. పండ్ల ధరలు కూడా వినియోగదారులకు షాక్ ఇచ్చాయి. నిన్నమొన్నటి వరకు కిలో రూ.200 ఉన్న యాపిల్ పండ్లు.. నేడు రూ. 350కి చేరాయి. దానిమ్మ పండ్ల ధరల గురించి చెప్పనక్కర్లేదు. చిన్నవి కిలో రూ. 350 ఉండగా, పెద్దవి రూ. 500 వరకు పలికాయి. అరటి పండ్లు కిలో రూ.100, బత్తాయిలు రూ.120కి విక్రయించారు. వీటితో పాటు కొబ్బరికాయలు, అరటి డొప్పలు, తమలపాకుల ధరలు కూడా పెరిగిపోయాయి.

జోరుగా టపాసుల అమ్మకాలు

దీపావళి సంబరాల్లో ముఖ్యమైన బాణసంచా కొనుగోళ్లు జోరుగా సాగాయి. ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్, ఏఎస్ రాజా గ్రౌండ్‌తో పాటు గోపాలపట్నం, మల్కాపురం, సుజాతనగర్, పెందుర్తి, గాజువాక, షీలానగర్, కంచరపాలెం, ఎన్ఏడీ కూడలి వంటి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద సందడి నెలకొంది. కొందరు చిరు వ్యాపారులు పూర్ణా మార్కెట్ సమీపంలోని స్ప్రింగ్‌రోడ్డు, వన్‌టౌన్ రహదారి, బ్యారెక్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో బండ్లపై గ్రీన్‌కాకర్స్ విక్రయించారు. ధరల భారం ఉన్నప్పటికీ.. ప్రజలు వెలుగుల పండగను సంతోషంగా జరుపుకునేందుకు ఉత్సాహంగా కొనుగోళ్లు పూర్తి చేశారు.

పల్లెకు చలో చలో..



వెలుగుల పండగను కుటుంబ సభ్యుల మధ్య జరుపుకోవాలనే ఉత్సాహంతో నగరవాసులు సొంతూళ్లకు పయనమయ్యారు. పండగకు ముందు ఆదివారం సెలవు కలసిరావడంతో.. పట్టణ జీవితానికి తాత్కాలిక విరామం ఇచ్చి, పల్లె బాట పట్టారు. దీంతో ద్వారకా కాంప్లెక్స్ జనసందోహంతో కిటకిటలాడింది. అయితే బస్సుల్లో సీటు సంపాదించడం కోసం ప్రయాణికులు పడిన పాట్లు వర్ణనాతీతం. చంటి బిడ్డలను పట్టుకుని బస్సుల్లో సీట్ల కోసం తల్లులు ఇబ్బందులు పడ్డారు. దీంతో ఉత్తరాంధ్ర జిల్లాలకు వెళ్లే బస్సులన్నీ ఖాళీ లేకుండా ప్రయాణించాయి.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం







క్రికెట్ పోటీల విజేత విశాఖ రెవెన్యూ జట్టు



విశాఖ స్పోర్ట్స్: జోన్–1 రెవెన్యూ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ టైటిల్ పోరులో విశాఖ రెవెన్యూ జట్టు ఏడు వికెట్ల తేడాతో అనకాపల్లి రెవెన్యూ జట్టుపై విజయం సాధించింది. రైల్వే స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో జోన్ పరిధిలోని ఆరు జట్లు పోటీ పడగా ఆదివారం ఫైనల్ జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన అనకాపల్లి జట్టు 16 ఓవర్లలో 88 పరుగులకు ఆలౌటైంది. విశాఖ కెప్టెన్ రాజేంద్ర నాలుగు వికెట్లు తీసి మ్యాచ్ బెస్ట్‌గా నిలిచాడు. ప్రసన్న కుమార్ రెండు వికెట్లు తీశాడు. ప్రతిగా విశాఖ జట్టు 14 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. భవానీశంకర్ 36 పరుగులతో రాణించాడు.

రాష్ట్ర అవతరణ దినోత్సవంపై భేషజాలు వీడండి

- తెలుగుదండు అధ్యక్షుడు ఫణిశయన సూరి
- నవంబర్ 1న అధికారికంగా నిర్వహించాలని సీఎంకు బహిరంగ లేఖ



మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద తెలుగుదండు ప్రతినిధుల నిరసన

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని నవంబర్ 1న అధికారికంగా నిర్వహించాలని తెలుగుదండు డిమాండ్ చేసింది. ఈ మేరకు మద్దిలపాలెం కూడలిలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద ఆదివారం నిరసన జరిగింది. తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు ఫణిశయన సూరి నేతృత్వంలో సాహితీవేత్తలు తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ముఖ్యమంత్రికి బహిరంగ లేఖను విడుదల చేశారు. 'ఈ ఏడాది నుంచైనా నవంబరు 1న రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి. తెలంగాణ విడిపోయినా, నవంబర్ 1వ తేదీ యథావిధిగా మన రాష్ట్ర అవతరణ దినోత్సవమే. దీనిపై భేషజాలకు పోకుండా అవతరణ దినోత్సవాన్ని జరిపించాలి.'అని ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే, అధికార భాషా సంఘం స్థానంలో మాతృభాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయాలని ఫణిశయన సూరి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆచార్య ప్రసాద్, చిన్న సూర్యనారాయణ, అడపా రామకృష్ణ, రాజమన్నార్, హేమ, ఉండవిల్లి సుజాత, ప్రజా గాయకుడు దేవీశ్రీ తదితర సాహితీవేత్తలు, కవులు పాల్గొన్నారు.

రుషికొండ భవనాలను మ్యూజియంగా ప్రకటించాలి

ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుద్ధిస్టుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న బుద్ధిస్టులు

బీచ్‌రోడ్డు: రుషికొండపై నిర్మించిన భవనాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించకుండా వాటిని రాష్ట్ర మ్యూజియంగా ఏర్పాటు చేయాలని బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రైవేటు సంస్థలకు భవనాలను అప్పగించేందుకు ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ.. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అసోసియేషన్ ప్రతినిధులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుషికొండ భవనాలపై హైకోర్టులో రిట్ పిటిషన్లు(241/2021, 257/2021), సీసీ నంబర్ 1425/2022 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. భవనాలను నిపుణులతో పరిశీలించి నివేదిక ఇవ్వాలని హైకోర్టు, కేంద్ర పర్యావరణ శాఖను ఆదేశించినా, ఆ నివేదిక ఇంకా కోర్టుకు అందలేదని తెలిపారు. అనేక కేసులు పెండింగ్‌లో ఉండగా.. హైకోర్టు తుది తీర్పు కోసం ఆగకుండా, ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో ప్రభుత్వం చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడటం సరికాదని వారు మండిపడ్డారు. విశాఖపట్నం చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగిన ప్రాంతమని.. బౌద్ధ, జైన అవశేషాలు ఇక్కడ విరివిగా ఉన్నాయని గుర్తు చేశారు. తెలుగుజాతి ఔన్నత్యం, భావితరాలకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు ఈ మ్యూజియం ఎంతో అవసరమని తెలిపారు. మ్యూజియం ఏర్పాటు చేయడం ద్వారా జపాన్, చైనా, థాయిలాండ్ వంటి బౌద్ధ దేశాల నుంచి పర్యాటకులు వస్తారని.. విదేశీ మారక ద్రవ్యం లభిస్తుందని, కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు కూడా రాబట్టుకోవచ్చని సూచించారు. పెండింగ్ కేసుల నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.